హైదరాబాద్ వార్త





# సిఎం నివాసంలో చిన్నారులతో రాఖీ కట్టించుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

# డ్రగ్స్,గంజాయిపై ఎక్సైజ్‌శాఖ ఫోకస్

**-పబ్బులు, బార్లల్లో విస్తృతమైన తనిఖీలు**

**-అనుమానం ఉన్నచోట శాంపిల్స్ సేకరణ**

**-మత్తు పదార్థాలు వాడితే చర్యలు తప్పవని హెచ్చరిక**

**హైదరాబాద్, ఆగస్టు 19,ప్రభాతవార్త:** ఈనగరానికి ఏమైంది...ఒకవైపు మూసి, మరోవైపు పొగ ,గుట్కా పాన్ మసాల అనేది ఒకప్పటి ప్రచారం..ప్రస్తుతం గంజాయి ,డ్రగ్స్ ,పబ్బులు, బార్లు ఇప్పటి మాట. పెరిగిపోతున్న పాశ్చత్య పోకడలకు నెలువుగా మారిన పబ్బులు, బార్లలో వీటి అమ్మకాలు ఎక్కువ జరగుతుండటంతో వాటిని అరికట్టేందుకు ఎక్సైజ్‌శాఖ నిఘా పెంచింది. ప్రపంచ ప్రఖ్యాతి కాంచిన నగరాల్లో హైదరాబాద్ ఒకటి. సాఫ్ట్‌వేర్‌రంగంతో పాటు పారిశ్రామిక ,విద్యా, వైద్యరంగాలతోపాటు వ్యాపార రంగాల్లో గ్రేటర్ హైదరాబాద్ ప్రత్యేక స్థానం సంతరించుకుంది. ఇక్కడి వరకు బాగానే ఉన్నా.. మత్తుపదార్థాల సరఫరాసైతం నగరానికి జోరుగా సాగుతుంది. కర్ణాటక, గోవా ఇతర ప్రాంతాల నుంచి డ్రగ్స్, ఎన్‌డిపిఎల్ మద్యం సరఫరా అవుతున్నాయి. మరోపక్క ఏవోబి ఆంధ్రా ఒరిస్సా బార్డర్ నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా గంజాయి రవాణా అవుతుంది. అది నగరం నడిబొడ్డున గల దూల్‌పేట్‌తో పాటు నగరమంతా బస్తీలు, కాలనీలకు విస్తరిస్తుంది.

**బార్లను పబ్బులుగా మార్చి..**

హైదరాబాద్‌లో చాలామంది బెడ్‌కాఫీ, టీతో నిద్రలేస్తారు. కానీ ఉరుకుల పరుగుల ఉద్యోగాల తోపాటు పనిఒత్తిడిని నుంచి బయట పడడానికి చాలా మంది పబ్బులకు ,బార్లకు వెళ్లడం పరిపాటిగా మారింది. ఈ బార్లను పబ్బులుగా మారనచడానికి అవసరమైన అనుముతుల పోలీస్ శాఖ ఇస్తుంది. ఈనేపథ్యంలో ఇటీవల ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో పబ్బుల్లో డ్రగ్స్ మాఫీయా అడుగుపెట్టిందా..? అనే పరిశీలన కోసం హైదరాబాద్, రంగారెడ్డి ప్రాంతాల్లోని ప్రధాన బార్లు, పబ్బులపై మూకుమ్మడి దాడులు, తనిఖీలు చేపట్టారు. ఎక్సైజ్‌శాఖ 12ప్యానల్ డ్రగ్స్ డిటెక్షన్ కిట్స్‌తో పబ్బుల్లోని వారిపై పరీక్షలు నిర్వహించారు. ఈటెస్టుల్లో ఎవరికి పాజిటివ్ రాలేదు. కాని బార్లు పబ్బుల వరకు డ్రగ్స్ చేర కూడదని ఎవరైనా వాడితే కఠిన చర్యలు తప్పవి హెచ్చరించారు.చేశారు.

**ఆపరేషన్ దూల్‌పేట్ ...**

ఆగస్టు 31నాటికి ధూల్‌పేట్‌లో గంజాయి మరకలు లేకుండా చేయడానికి ఎక్సైజ్‌శాఖ కంకణం కట్టుకుంది. ఇప్పటికే ధూల్‌పేట్ ఇంటింటి తనిఖీలు, గంజాయి అమ్మకందార్లపై పెద్దమొత్తంలో కేసులు చేయడం చేస్తుంది. మరోపక్క గంజాయిని పెద్దమొత్తంలో తెప్పించి అమ్మకాలు చేపట్టే 15మందిని మాఫియా డాన్‌లను గుర్తించి వారిలో కొందరిని అరెస్ట్ చేయడం చేశారు. వీరితో పాటు చిన్నచిన్న ప్యాకెట్లుగా అమ్మకాలు చేపట్టే వారిని పట్టుకోవడం, వారిని కటకటాలకు పంపించడంలో చాలామంది గంజాయి అమ్మకం దార్లు పరారయ్యారు.

ఈసందర్భంగా దూల్‌పేట్‌లో 30కేసులు నమోదు చేశారు. 54మందిని రిమాండ్‌కు పంపించారు. 28మందిని బైండోవర్ చేశారు. మరో 53మంది పరారీలో ఉన్నారు.

## పసివాడి ఉసురు తీసిన నిర్లక్ష్య డ్రైవింగ్

**-ఇంటి ముందు ఆడుకుంటున్న బాలుడిపై నుండి వెళ్ళిన కారు**

**-తీవ్ర గాయాలతో చికిత్స పొందుతూ మృతి**



ప్రమాదానికి కారణమైన కారు

**సరూర్‌నగర్, ఆగస్టు 19 ప్రభాతవార్త:** ఓ కారు యజమాని నిర్లక్ష్యం ఒక పసివాని ఉసురు తీసింది. కారును అజాగ్రత్తగా నడపడం వల్ల ఇంటి ముందు ఆడుకుంటున్న 22 నెలల పసి బాలుడు తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో మృత్యువుతో పోరాడి తుదిశ్వాస విడిచాడు. ఈ విషాదకర సంఘటన నగర శివార్లలోని మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్స్పెక్టర్ కీసర నాగరాజు కథనం ప్రకారం సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. కారు డ్రైవర్‌గా పని చేసే వరికుప్పల రామకృష్ణ తన కుటుంబంతో హస్తినాపురం జడ్పీ రోడ్డులో నివాసం ఉంటున్నాడు. అయితే ఆదివారం సాయంత్రం అతని కుమారుడు వరికుప్పల దీక్షిత్ (22 నెలలు) ఇంటి ముందు ఆడుకుంటుండగా అదే సమయంలో కొత్తకాపు దినేష్‌రెడ్డి తన కారు (నెంబర్ టిఎస్ 07 కెడి 4567) అజాగ్రత్తగా నడిపి ఢీకొట్టాడు. దీంతో తలకు తీవ్ర గాయం కావడంతో దీక్షిత్‌ను చికిత్స నిమిత్తం కామినేని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బాలుడు అదే రోజు అర్ధరాత్రి మృతి చెందాడు. ఈ మేరకు కేసును నమోదు చేసుకొని మీర్‌పేట్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## తార్నాక హెచ్‌పిపెట్రోల్ బంక్‌లో పెట్రోలుకు బదులు నీళ్లు

**-పలు వాహనదారుల గగ్గోలు**

**-నిర్లక్ష్యంగా సమాదానం ఇచ్చిన బంక్ సిబ్బంది**



కారు పెట్రోల్ ట్యాంక్‌లో నుంచి తీసిన నీరు



హెచ్‌పి బంక్

**తార్నాక, ఆగస్టు 19 ప్రభాతవార్త:** తార్నాక చౌరస్తాలో ఉన్న హెచ్‌పి పెట్రోల్ బంక్‌లో తమ వాహనాల్లో పెట్రోల్ పోయించుకున్న వాహన దారులు షాక్ తిన్నారు. వాహనాల్లో పెట్రోల్ పోయించుకున్న వాహణదారులకు పెట్రోల్‌కు బదులు నీళ్లు వచ్చాయి. పెట్రోల్ పోయించుకున్న కొద్ది సేపటికే వాహనాలు ఆగిపోవడంతో వెంటనే బంక్‌కు వచ్చి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 10 వాహనాల్లో పెట్రోల్‌కు బదులు వాటర్ వచ్చింది. దీంతో వాహనదారులు ఆగ్రహానికి గురికావడంతో ఏమి చేయలేని పరిస్థితుల్లో వాహనాలను బంక్ సిబ్బంది బాగు చేయించారు. ఎక్కువ మంది బాదితులు బంక్‌కు రావడంతో ఉస్మానియా యూనివర్సిటీ పోలీసులు కూడా ఘటనా స్థలానికి చేరుకొని వాహణదారులకు సముదాయించి పంపించారు. పెట్రోల్ పోయించుకున్న కొద్ది సేపటికే పెట్రోల్ పైపు నిండ నీరు చేరడంతో వాహణదారులు అనేక ఇబ్బందులు పడ్డారు. ఇదే బంక్‌లో గతంలో కూడా పెట్రోల్‌కు బదులు వాటర్ రావడంతో అప్పుడు కూడా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సివిల్ సప్లయ్ అధికారులు పర్యవేక్షణలోపం కారణంగానే ఇలా బంక్‌లో తరుచు సమస్యలొస్తున్నాయని వాహణదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు బంక్‌పై చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించాలి

**-జిహెచ్ఎంసి కమిషనర్ అమ్రపాలి**



ఆర్జీలను స్వీకరిస్తున్న కమిషనర్ అమ్రపాలి, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 19,ప్రభాతవార్త:** ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను వేగవంతంగా పరిష్కరించాలని జిహెచ్ఎంసి కమిషనర్ అమ్రపాలి కాట అధికారులను ఆదేశించారు. సోమవారం జిహెచ్ఎంసి ప్రధాన కార్యాయలంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డితో కలిసి ఆర్జీలను స్వీకరించారు. ఈసందర్భంగా కమిషనర్ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను ఆయా విభాగాల అధికారులు వేగవంతంగా పరిష్కరించాలని సూచించారు. డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి మాట్లాడుతూ ..ప్రజావాణిలో వచ్చిన ఆర్జీల పరిష్కారంపై ఆయా అధికారులు దృష్టి సారించాలన్నారు. జాప్యం చేయకుండా ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఈకార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు సత్యనారాయణ, యాదగిరిరావు, నళిని పద్మావతి, సిసిపి శ్రీనివాస్, అడిషనల్ సిసిపి గంగాధర్ ఆయా విభాగాల వాల్యూవేషన్ అధికారి మహేష్‌కులకర్ణి, ఛీఫ్ ఎంటమాజీ డాక్టర్ రాంబాబు, ఎస్ఈ హౌజింగ్ జాయింట్ కమిషనర్ ఎస్‌బిఎం కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

## మంత్రముగ్దులను చేసిన పద్యనాటక ప్రదర్శన



నాటకరంగ కళాకారులను సత్కరిస్తున్న త్యాగరాయ గానసభ అధ్యక్షుడు కళావిఎస్.జనార్ధనమూరి

**చిక్కడపల్లి, ఆగస్టు 19 ప్రభాతవార్త:** రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సోమవారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభ,శారద కళానికేతన్ నిర్వహణలో గానసభలోని కళా సుబ్బారావు కళావేదికలో తిరుపతి వెంకటకవులు రచించిన 'పాండవోద్యోగ విజయాలు'లోని 'శయన దృశ్యం'లో నటులు పోటీపోటీ పద్యాలాపనతో రసజ్ఞులైన ప్రేక్షకులను రంజింపచేశారు. కృష్ణుడిగా పున్నారావు, దుర్యోధనునిగా సంజీవరావు, అర్జునుడిగా నారాయణస్వామిల నటన పద్యాలాపన అందరిని మంత్రముగ్దులనుచేసింది. ప్రముఖ హార్మోనిస్ట్ రాజబాబు సంగీత సహకారంతో నాటకానికి రక్తికట్టించారు. ఈ సందర్భంగా జరిగిన సభా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గానసభ అధ్యక్షుడు కళావిఎస్.జనార్ధనమూర్తి మాట్లాడుతూ రెండు రోజుల పాటు సంగీత, నృత్య నాటక కార్యక్రమాలకు ఉచిత వేదిక నిత్యవేడుకలో శారద కళానికేతన్‌కు ఇచ్చామన్నారు. రాజబాబు విఖ్యాత గాయకుడు బాలసుబ్రహ్మణ్యంకు మెచ్చిన కళాకారుడు అని అభినందించారు. నిర్వాహకులు రాజబాబు మాట్లాడుతూ పౌరాణిక నాటక ప్రదర్శనకు వేల ఖర్చు అవుతుందని, ప్రేక్షకుల స్పందన లేకుంటే తెలుగు పద్యనాటకం కనుమరుగయ్యే అవకాశం ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు.

# పనులు చేసి ఫలితమేంటి..?

**-అకాల వర్షాలతో బయటపడుతున్న వైఫల్యాలు**

**-నాలాల్లో చెత్తా చెదారం, మట్టి కుప్పలు**

**-తొలగించిన వ్యర్థాలు సైతం తిరిగి నాలాల్లోకే**

**-నామమాత్రంగానే పూడికతీత పనులు**



**హైదరాబాద్,ఆగస్టు 19 ప్రభాతవార్త** గ్రేటర్ నాలాల పూడికతీత పనులు 80శాతానికి పూగా పూర్తయ్యాయని జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ వర్గాలు చెబుతున్నాయి. క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. ఇటీవలి అకాల వర్షాలకు పలు ప్రాంతాలలో నాలాలు పొంగిపోయి కొన్ని చోట్ల ఇళ్లల్లోకి వరదనీరు పొంగిపొగా, కొన్ని చోట్ల ఇళ్లల్లోకి వరదనీరు చేరగా, ఇంకొన్ని ప్రాంతాల్లో రోడ్డుపై ప్రవహించింది. కొన్ని నాలాల్లో చెత్తా చెదారం, మట్టి కుప్పలు ఇప్పటికీ దర్శనమిస్తున్నాయి. దీంతో పూడికతీతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వ్యర్థాలు తొలగించారా..? కాగితాల్లో కాకి లెక్కలతో సరి పెడుతున్నారా..? అన్నది తేల్సాల్సి ఉంది. కాలనీ, బస్తీ, మేజర్, మైనర్ నాలా అనే తేడా లేకుండా చాలా ప్రాంతాల్లో వ్యర్థాలు మేట వేశాయి. ప్రవాహ వ్యవస్థ సాఫీగా లేక నాలాలు పొంగి పక్కనున్న ప్రాంతాల్లోకి వరద నీరు చేరుతోంది. ఇది స్థానికులతో పాటు వాహనాల రాకపోకలకు అంతరాయంగా మారుతోంది.

**ఎక్కడ చూసినా వ్యర్థాలే..**

వర్షాకాలంలోపు మొత్తం వ్యర్థాలను తొలగించాలి. అనంతరం వరదతో పాటు వచ్చే చెత్తాచెదారం, ఇతర వ్యర్థాలు ఎప్పటికప్పుడు తీయాలి. ఇప్పటికే అకాల వర్షాలు మొదలయ్యాయి. ఈసారి వానలు విస్తారంగా కురిసే అవకాశముందని వాతావరణ శాఖ చెబుతోంది. అయినా నాలాల పూడికతీత పనులు పూర్తికావడంలేదు. దీంతో మరోసారి నగరానికి ముంపు ముప్పు తప్పేలాలేదు. తొలగించిన వ్యర్థాలను నాలాలపక్కనే వేస్తుండడంతో వర్షాలకు తిరిగి నాలాల్లో చేరుతున్నాయి. దీంతో పనులు చేసినా ప్రయోజనం లేకుండాపోతోంది.వర్షానికి దెబ్బతిన్న రోడ్ల నిర్మాణం, మరమ్మత్తు, నాలాల పూడికతీత, ఇతరత్రా పనులు ముందుగా సాగే అవకాశం కనిపించడం లేదు.

**నాలా.. కొన్ని ప్రాంతాల్లో ఇలా..**

నల్లకుంట పద్మాకాలనీ నుంచి పాత రామాలయం, ఫీవర్ ఆస్పత్రి చౌరస్తా మీదుగా హుస్సేన్ సాగర్ నాలాలో తిలక్‌నగర్ రైల్వే బ్రిడ్జి వద్ద కలుస్తుంది. శివం రోడ్ ఎన్‌సీసీ నుంచి న్యూనల్లకుంట, తిలక్‌నగర్ సీగల్‌కేఫ్, ఛేనెంబర్ చౌరస్తా, శంకర్‌నగర్, డీమార్ట్ పక్క నుంచి మూసీ నదిలో కలిసే నాలాలోనూ వ్యర్థాలు తొలగించలేదు. బాగ్ లింగంపల్లి బ్రిడ్జి వద్ద నుంచి గాంధీనగర్, రత్నానగర్, ఖార్ఖానా, నెహ్రూ నగర్, శాస్త్రీ నగర్ నుంచి మూసీలో కలిసే హుస్సేన్ సర్‌ప్లస్ నాలాలోనూ పూడికతీత పనులు ఇప్పటికీ పూర్తికాలేదు. బాగ్ అంబర్‌పేట డివిజన్ మోహిన్‌చెరువు నుంచి అంబర్‌పేట డివిజన్ బాపునగర్, చెన్నారెడ్డినగర్, న్యూ పటేల్ నగర్, పటేల్‌నగర్, ప్రేమ్ నగర్ల మీదుగా మూసీలో కలిసే వరకు ఉన్న ఈ నాలాలో పూడికతీత పనులు నామమాత్రంగా కొనసాగాయి. .గుడిమల్కాపూర్ నుంచి మోఘల్ కా నాలా వరకు, రేతిబౌలి నుంచి గుడిమల్కాపూర్ వరకు, రేతిబౌలి నుంచి గుడిమల్కాపూర్ వరకు, టోలిచౌకి నుంచి శాతం చెరువు వరకు నాలాల్లో వ్యర్థాలు తొలగించలేదని స్థానికులు చెబుతున్నారు. హఫీజ్‌పేట, ప్రేంనగర్, ఆదిత్యనగర్, గోపినగర్, మియాపూర్, మాదాపూర్ తదితర ప్రాంతాల్లో నాలాల్లో చెత్త మట్టితో దర్శనమిస్తున్నాయి. చంపాపేట డివిజన్‌లోని పలు కాలనీల్లో పూడికతీత పనులు ఇంకా జరగలేదు. వర్షాలు మొదలైన దృష్ట్యా వెంటనే వ్యర్థాల తొలగింపు ప్రారంభించాలి. ఇటీవల వాలనకు నాలాలు పొంగిపొర్లి స్థానికంగా ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి. వరదనీరు సాఫీగా వెళ్లేలా వెంటనే చర్యలు తీసుకోవాలి. దుర్గా భవానీ నగర్,చంపాపేట రెడ్డి కాలనీలోఎని నాలా పూడికతీత పనులు ఇప్పటికీ జరగలేదు. గతేడాది కూడా వర్షాలు మొదలయ్యాక తూతూమంత్రంగా వ్యర్థాలు తొలగించారని స్థానికులు చెబుతున్నారు. ఇదే డివిజన్‌లోని మారుతీనగర్, దుర్గా భవానీ నగర్, ఎప్‌జీఆర్ కాలనీల్లోనూ పూడిక తీయక పోవడంతో ఇటీవల వర్షాలకు వరద నీరు రోడ్లపైకి చేరింది. జీడిమెట్ల పారిశ్రామికవాడలోని నాలాలు పూర్తిగా చెత్తాచెదారంతో నిండి ఉన్నాయి. ఎస్ఆర్ నాయక్ నగర్‌లో వర్షం పడితే నాలాల్లోని నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది.

# నగరంలో దంచి కొట్టిన వాన

**-ఒక వైపు భారీ వర్షం**

**-మరో వైపు తీవ్ర మైన ట్రాఫిక్ జాం.**

**-వాహన దారుల అవస్థలు**

**-ఎప్పటికీ తీరేనో ఈ కష్టాలంటూ నిట్టూర్చిన నగర ప్రజలు**



భారీ వర్షంతో ట్రాఫిక్ జామ్ అయిన దృశ్యం



బేగంపేట రసూల్‌పురా నుంచి పాటిగడ్డ వెళ్లే రోడ్డులో భారీగా నిల్చిపోయిన వర్షపు నీరు.

**బేగంపేట ఆగస్టు 19,ప్రభాతవార్త** హైదరాబాద్ నగరంలో సోమవారం ఉదయం భారీ జల్లులు కురిసాయి. మధ్యాహ్నం తరువాత ఆకాశం మేఘావృతమైంది.ఈ సమయంలో తీవ్ర ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోయారు.సాయంత్రం కాగానే భారీ వర్షం కురిసింది.దీంతో రోడ్లన్నీ చెరువులయ్యాయి.దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.వర్షం కురుస్తున్న సమయంలో మెట్రో స్టేషన్ల కింద ద్విచక్ర వాహన దారులు పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ తీవ్రంగా జాం అయింది. సాయంత్రం మొదలైన భారీ వర్షం కురుస్తూనే ఉండటంతో నగర వాసులు తడిసి ముద్దయ్యారు.ఒక వైపు భారీ వర్షంతో రోడ్లపైకి భారీగా చేరిన నీరు. మరో వైపు ట్రాఫిక్ జాంతో వాహనదారులకు నరకంగా మారంది.ఫ్లై ఓవర్లతో పాటు కింద ఉన్న రోడ్లపై పెద్ద ఎత్తున వాహనాలు నిల్చిపోయాయి. బేగంపేట,బంజారాహిల్,జూబ్లీహిల్స్ ,పంజాగుట్ట,బేగంబజార్,కోఠి, సుల్తాన్ బాజార్,అబిడ్స్ ,నాంపల్లి,బషీర్‌బాగ్,లిబర్టీ,హిమాయత్‌నగర్,నారాయణగూడా,లక్డీకాపూల్,ఖైరతాబాద్,తదితర ప్రాంతాల్లో ప్రధాన రోడ్లపై భారీ గా వర్షపు నీరు నిల్చిపోయి వాహనదారులకు ఇబ్బందిగా మారింది. బేగంపేట, సికింద్రాబాద్,ప్యారడైజ్,ప్యాట్నీ,తిరుమలగిరి,అల్వాల్,బోయిన్‌పల్లి,షేక్‌పేట,ఫిల్మ్‌నగర్,గచ్చిబౌలీ,జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్,బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12,ఒకటిలలో భారీగా ట్రాఫిక్ జాం అయింది.కూకట్‌పల్లి, మూసాపేట, వైజంక్షన్, మియాపూర్,చందానగర్ లింగంపల్లి,మాదాపూర్, గచ్చిబౌలీ, రాయదుర్గం, కుత్బుల్లాపూర్,గాజుల రామారం,జగద్గిరిగుట్ట, మారేడుపల్లి, బేగంపేట, తిరుమలగిరి,అల్వాల్,మారేడుపల్లి,కూకట్‌పల్లి,హైదర్‌నగర్,బాచుపల్లి, మూసాపేట తదితర ప్రాంతాల్లో వర్షం కురిసింది.

**ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఉక్కపోత.....**

ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఉక్కపోత తో నగర వాసులు అల్లాడిపోయారు.మధ్యాహ్నం మబ్బులు కమ్మి సాయంత్రానికి భారీ వర్షం కురియడంతో నగరం అతలాకుతలమైంది.ఒక్క సారిగా భారీ వర్షం కురియడంతో నీరు పోయే మార్గం లేక వాహనదారులు,పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.బంజారాహిల్స్ కేబీఆర్ పార్కులోని నీరు రోడ్డుపైకి చేరడంతో కేబీఆర్‌పార్కు ప్రధాన గేటు ముందు నుంచి జూబ్లీ హిల్స్ చెక్ పోస్ట్ మధ్య ట్రాఫిక్ మెల్లగా సాగింది.

**నగరంలో 7సెం.మీల వరకు నమోదైన వర్షపాతం..**

విదర్భా నుంచి దక్షిణ కర్నాటక వరకు తెలంగాణా,నార్త్ ఇంటీరియర్ కర్నాటక వరకు సముద్ర మట్టానికి 7.6 కి.మీ ఎత్తులో ద్రోణి కొనసాగుతుంది.దీని ప్రభావంతో తెలంగాణా అంతటా తేలిక పాటి నుంచి ఓ మోస్తారు వర్షాలు చాలా చోట్ల కురిసే అవకాశం ఉంది.అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు తెలియజేసారు.ఈ ప్రభావం రెండు,మూడు రోజుల పాటు కొనసాగే అవకాశం ఉంది.నగరంలో సోమవారం రాత్రి గం 7ల వరకు నమోదైంది. షేక్‌పేట,ఖైరతాబాద్, శేరిలింగంపల్లి, బాలానగర్,మారేడుపల్లి,కుత్బుల్లాపూర్,గోల్కొండ లలో 4 నుంచి 6సెం.మీల వర్షపాతం నమోదైంది.రాష్ట్రంలో 22చోట్ల 7సెం.మీల పైన భారీ వర్షపాతం నమోదైంది.నిజామాబాద్ సిద్దిపేట,నల్లగొండ,యాదాద్రి భువనగిరి, నిర్మల్,జోగులాంబ గద్వాల,జగిత్యాల,జనగాం,మేడ్చల్ మల్కాజ్‌గిరి,రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షపాతం నమోంది.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

**సంజీవ్‌రెడ్డి నగర్, ఆగస్టు 19, ప్రభాతవార్త** ఎస్సార్‌నగర్ ఇన్స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఎస్సార్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అమీర్‌పేట, మైత్రివనం చౌరస్తా వద్ద ఆదివారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగిందని మెదక్ చర్చిలో ప్రార్థనలు ముగించుకొని మైత్రీవనం నుండి బేగంపేట వైపు హోండాషైన్ బైక్‌పై వెళ్తున్న ప్రసాద్ (19)ను హైటెక్ సిటీ నుండి బేగంపేట వైపు వెళ్తున్న కారు ఢీకొనడంతో మృతి చెందినట్లు తెలిపారు. ప్రమాదానికి కారణమయిన వాహనాన్ని మహిళ నడిపిందని ఈ మేరకు డ్రైవింగ్ చేసిన మహిళను, కారును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఇన్స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు. మృతుని బంధువులు ఎస్ఆర్ నగర్ పోలీస్ స్టేషన్ ముందు ఆందోళనకు దిగారు.

తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఫార్మాలిటీస్ పూర్తి చేసుకుని మృతి చెందిన ప్రసాద్ భౌతికకాయాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఇన్స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు.



ఎమ్మెల్యే కసిరెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న వెంకటయ్య

## ఎమ్మెల్యే కసిరెడ్డికి ఆహ్వానం

**ఆమనగల్లు, ఆగస్టు19, ప్రభాతవార్త:** ఆమనగల్లు సురసముద్రం చెరువు కట్ట మైసమ్మ దేవాలయంలో ఈనెల 21 నుండి 23వరకు జరగనున్న విగ్రహప్రతిష్ట మహోత్సవ కార్యక్రమానికి రావలసిందిగా కోరుతూ ఆలయ చైర్మన్ మొక్తాల వెంకటయ్య సోమవారం స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేశారు. కమిటీ మెంబర్ సభ్యులతో కలిసి వెళ్ళి హైదరాబాద్ నగరంలోని ఎమ్మెల్యే నివాసంలో కసిరెడ్డిని కలుసుకుని ఆహ్వానించారు. మూడురోజుల పాటు విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వారు కార్యక్రమ వివరాలు వెల్లడించారు. కార్యక్రమంలో మొక్తాల చిన్న వెంకటయ్య, ఎర్రవోలు మహేశ్, శ్రీశైలం, మాజీ వార్డు సభ్యుడు రాజు తదితరులు ఉన్నారు.

## గౌరారంను పంచాయతీగా ఏర్పాటు చేయండి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న గౌరారం ప్రజలు

**ఆమనగల్లు, ఆగస్టు19, ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఆకుతోటపల్లి పంచాయతీ పరిధిలోని గౌరారం గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని ఆగ్రామానికి చెందిన పలువురులు కోరారు. సోమవారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని కలుసుకుని పంచాయతీ ఏర్పాటు కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆకుతోటపల్లి పంచాయతీ క్రింద ఉన్న గౌరారం పంచాయతీగా మార్చేందుకు గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. పంచాయతీకి అవసరమైన అన్ని వసతులు గౌరారం గ్రామంలో ఉన్నాయని, 507 నివాసాలు, జనాభా కల్గి ఉందని, ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ, రేషన్‌షాపు, పోలింగ్ బూత్ వంటి వసతులు ఉన్నాయన్నారు.కాగా పంచాయతీ సేవలు పొందేందుకు కిలోమీటర్లు ప్రయాణంతో ఆకుతోటపల్లి గ్రామానికి వెళ్ళి పొందవలసి వస్తుందన్నారు. చాలా ఏళ్ళుగా గౌరారంను ప్రత్యేక పంచాయతీ చేయాలని డిమాండ్ ఉందని, అందుకు గతంలో ఏకగ్రీవ తీర్మానం చేసి ఎంపీడీఓ కార్యాలయంలో కూడా అందజేసినట్లు వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చినట్లు వారు తెలిపారు. ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ చూపి గౌరారం గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని వారు వినతిపత్రం అందజేయగా, అందుకు ఎమ్మెల్యే ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో చిటుగోరి సీతారాంరావు, నిట్ట కొండల్, జగన్, మైపాల్‌రెడ్డి, శ్రీనివాసరావు, ప్రశాంత్‌రెడ్డి, రాఘవేందర్, భూపతిరెడ్డి, సరేందర్‌రావు, వీరేశ్, వెంకట్‌రెడ్డి, మహేశ్, శివ తదితరులు ఉన్నారు.

## మహిళా మృతి.. ఆర్థిక సాయం అందజేత



**తలకొండపల్లి, ఆగస్టు 19, ప్రభాతవార్త** తలకొండపల్లి మండల పరిధి లోని మొదక్‌పల్లి గ్రామానికి చెందిన అక్కల రామచంద్రమ్మ అనే మహిళ శనివారం రాత్రి మృతి చెందింది. ఇటీవల అనారోగ్యానికి గురైన రామచంద్రమ్మను శనివారం సాయంత్రం చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో డాక్టర్లు ధర్నా చేస్తుండడంతో రామచంద్రమ్మ కు చికిత్స చేయలేకపోయారు. దీంతో రామచంద్రమ్మ చికిత్స చేయకుండానే మృతి చెందింది.ఆదివారం మెదక్‌పల్లి గ్రామంలో వారింటిలో రామచం ద్రమ్మ భర్త అక్కల అంజయ్యను పరామర్శించి ధైర్య చెప్పారు. ప్రెస్ క్లబ్ మండల అధ్యక్షుడు దరువులు శంకర్ వ్యక్తిగతంగా 2000 వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ సానమౌని నరేష్ మాజీ రైతు కమిటీ అధ్యక్షుడు ఈశ్వర్ గౌడ్ బిఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు మార్చే మల్లయ్య నాయకులు దరువుల పాండు దుర్గాపురం రవి పాల్గొన్నారు.

## బిజెపి నాయకుడు శానమోని పాండు తండ్రి మృతి

**అంత్యక్రియల్లో పాల్గొన్న మాజీ ఓబిసి జాతీయ కమిషన్ సభ్యుడు ఆచారి**



**తలకొండపల్లి, ఆగస్టు 19, ప్రభాతవార్త** తలకొండపల్లి గ్రామం శానమోని చంద్రయ్య ముదిరాజ్ మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఓబిసి జాతీయ కమిషన్ సభ్యులు ఆచారి విచ్చేసి పూలమాలవేసి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి ప్రగాఢ సానుభూతి తెలిపి అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

## తలకొండపల్లిలో ఫొటో గ్రఫీ దినోత్సవం



**తలకొండపల్లి, ఆగస్టు 19, ప్రభాతవార్త** రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలకేంద్రంలో ప్రపంచ ఫోటో గ్రఫీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫొటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగురె చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి ఫోటో గ్రఫీకి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఫోటో గ్రఫీ మండల అధ్యక్షుడు నరసింహ, ఉపాధ్యక్షులు మధు ప్రధాన కార్యదర్శి మహేష్ కోశాధికారి రమేష్ విజయ్ గౌరవ సభ్యులు కలేశేఖర్ శీను రావుఫ్ శ్రీకాంత్ కిరణ్ తరుణ్ వేణు గిరి సాయి మహేష్ చెన్న కేశవులు పాల్గొన్నారు.

## 21న పోలీసు ప్రధాన కార్యాలయంలో వాహనాల వేలం

### -మెదక్ జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

**మెదక్ అర్బన్, ఆగస్టు 19 ప్రభాతవార్త:**

పోలీస్ స్టేషన్లలో యజమానులు తీసుకోకుండా ఉన్న వాహనాలు, గుర్తు తెలియని వాహనాలు స్క్రాప్‌గా వేలం వేయనున్నట్లు జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి తెలిపారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఆయా పోలీస్ స్టేషన్లలో యజమానులు తీసుకోకుండా ఉన్న వాహనాలు, గుర్తు తెలియని వాహనాలను జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయానికి తరలించినట్లు తెలిపారు.

# సర్వాయి పాపన్నగౌడ్ ఆశయ సాధనకు కృషి చేద్దాం

**గౌడ కార్మిక సంఘం**
**అధ్యక్షుడు లాలికోట రాములుగౌడ్**



విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పిస్తున్న గౌడ సంఘం నాయకులు

**కడ్తాల్, ఆగస్టు 19 ప్రభాతవార్త :** పేద, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ ఎంతో కృషి చేశాడని ఆయన సేవలు చిరస్మర ణీయమని చరికొండ గౌడ కార్మిక సంఘం 1581 అధ్యక్షుడు లాలికోట రాములుగౌడ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని చరికొండ గ్రామంలో లాలికోట రాములుగౌడ్ అధ్యక్షతన గౌడ కల్లుగీ కార్మికులు సమావేశమ య్యారు. గౌడ కల్లుగీత కార్మికుల సమస్యలపై చర్చించారు. గీత కార్మికులను అన్ని విధాలుగా ఆదుకోవాలని, ఆర్థికంగా చేయూతనందించాలని గీత కార్మికుల సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడుదామని అన్నారు. అంతకు ముందు గౌడ కార్మిక సంఘం నాయకులు సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామంలో ఆదివారం సర్దార్ పాపన్నగౌడ్ 374 జయంతి వేడుకలను పురస్కరించుకుని పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణకు విచ్చేసి కార్యక్ర మాన్ని జయప్రదం చేసిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, బిజెపి నాయకులు ఆచారి నాయకులు లాలికోట నర్సిం హగౌడ్, మాజీ ఎంపిటిసి రాములుగౌడ్‌లకు గౌడ కార్మిక సంఘం తరపున కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో సంఘం ఉపాధ్యక్షుడు యాదయ్యగౌడ్, ప్రధాన కార్యదర్శులు యాదయ్యగౌడ్, కృష్ణయ్యగౌడ్, కార్యదర్శులు అంజయ్యగౌడ్, యాదయ్యగౌడ్, కోశాధికారి పెద్ద చంద్రయ్యగౌడ్, కార్యవర్గ సభ్యు లు నర్సింహగౌడ్, వెంకటయ్యగౌడ్, సత్తయ్యగౌడ్, కార్మిక సంఘం యువజన విభాగం అధ్యక్షుడు ముచ్చమంగౌడ్, నాయకులు జంగయ్యగౌడ్, ముత్యాలుగౌడ్, పెద్దయ్య, బాలయ్యగౌడ్, లక్ష్మయ్యగౌడ్ ఉన్నారు.



ఉద్దెమర్రిలోని శ్రీవిష్ణు,శివాలయం వద్ద ముఖద్వార గాలిగోపురం పున:నిర్మాణంకు జరిగిన భూమి పూజ జరిగిన దృశ్యం

## ముఖద్వార గాలిగోపురం పున:నిర్మాణానికి భూమి పూజ

**శామీర్‌పేట, ఆగస్టు 19, ప్రభాతవార్త** ఉద్దెమర్రిలోని శ్రీఅక్కన్న,మాదన్నలు నిర్మించిన శ్రీవిష్ణు,శివాలయం వద్ద ముఖద్వార గాలిగోపురం పున:నిర్మాణం కొరకు భూమి పూజా కార్యక్రమం జరిగింది. సోమవారం మూడుచింతలపల్లి మండలంలోని ఉద్దెమర్రి గ్రామంలోని శ్రీవిష్ణు,శివాలయంలో ముఖద్వార గాలిగోపురం పున నిర్మాణం కొరకు ప్రత్యేక పూజలు జరిగాయి. శ్రీకంచి పీఠాధిశ్వరులు శంకర విజయేంద్ర సరస్వతి స్వామీ వారి,శ్రీగురు మదనానంద సరస్వతి పీఠాధిశ్వరులు మాదవనంద సరస్వతి స్వామి వారి దివ్య ఆశీస్సులతో ముఖద్వార గాలిగోపుర పుననిర్మాణం కొరకు శ్రీవిష్ణు,శివాలయం వద్ద భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగ ఈ ఆలయ ప్రాంగణంలో ఉన్న శ్రీవిష్ణు ఆలయంలో శ్రీ వేంకటేశ్వరస్వామికి, శివాలయంలో శ్రీభవానిరామలింగేశ్వరస్వామికి అభిషేక పూజా కార్యక్రమాలను దేవాలయ అర్చకులు తీగుళ్ల మాదవశర్మ నిర్వహించారు. దేవాలయ చైర్మన్ ఆడెపు ఉమామహేశ్వరి, కంచిపీఠాధిపతి స్వామి వారి శిష్య బృందం కొమ్ము దక్షిణమూర్తి, కొండపల్లి నాగేశ్వరస్వామి, ధర్మకర్తలు బూడిది రవీందర్‌గౌడ్, బురిగళ్ల రమేశ్, గ్రామ మాజీ సర్పంచులు దోసకాలయ వెంకటేశ, పట్ల బాల్‌నర్సింహ్మా, నాయకులు ఎన్.విష్ణుగౌడ్, బలరాంరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శ్రీధర్‌చారి, ప్రసాద్, నర్సింలు, శేఖర్, ఉద్దెమర్రి,ఉషార్‌పల్లి గ్రామాలకు చెందిన పలువురు భక్తులు, నగరం నుంచి పలువురు భక్తులు పాల్గొన్నారు.

## వొకేసనల్ కోర్సుల్లో చేరేందుకు నేడే చివరి తేదీ

**ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 19, ప్రభాత వార్త:** తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల ఇంటర్ కళాశాల యందు వోకేషనల్ కోర్సుల్లో చేరేందుకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ఉప్పల్ బ్రాంచి (ఏదులాబాద్ కైట్ ఇంజినీరింగ్ కళాశాలలో) ప్రిన్సిపల్ బి. వేణుగోపాల్ సోమవారం నాడొక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20 వ తేదిన కళాశాల ఆవరణలో ఉదయం 11 గంటలకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వోకేషనల్ కోర్సులు టీ అండ్ హెచ్‌ఎం, ఎంఎల్‌టీలకు గాను ఖాళీగా ఉన్న కోర్సులకు స్పాట్ అడ్మిషన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పదవ తరగతి పరీక్షల్లో మొదటి ప్రయ త్నంలోనే 2024 మార్చిలో జరిగిన పరీక్షల్లో ఉత్తీర్ణులైన ఎస్‌సీ, ఎస్‌టీ, బీసీ విద్యార్థులకు అవకాశం ఉన్నట్లు తెలిపారు. అర్హత కల్గి ఆసక్తి కల్గిన వారు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ప్రకటించిన సమయంలో హాజరుకావాల్సిందిగా కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు.

## కాంగ్రెస్ నాయకుడు బాల్‌రాజ్ మృతి



బాల్‌రాజ్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

**షాబాద్, ఆగస్టు 19, ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దండు బాల్‌రాజ్(78) సోమవారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందారు. షాబాద్‌లోని దండు బాల్‌రాజ్ ఇంటికి చేవెళ్ల కాలె యాదయ్య, చేవెళ్ల అసెంబ్లీ ఇంచార్జీ పామెన భీంభరత్ చేరుకునిని మృతునికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. కాంగ్రెస్‌పార్టీకి ఎనలేని సేవలు అందించిన బాలరాజ్ మృతి పార్టీకి తీరని లోటు అన్నారు. మృదుస్వభావి, అందరితో కలుపుగోలుగా ఉండే వ్యక్తి అకస్మాత్తుగా చనిపోవడం చాలా బాధగా ఉందన్నారు. మృతున్ని కుటుంబానికి ఎల్లప్పుడు అండగా ఉంటామన్నారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కావలి చంద్రశేఖర్, నాయకులు రాజేందర్‌గౌడ్, మహేందర్‌గౌడ్, దండు రాహుల్‌గుప్తా, రవీందర్‌నాయక్, కమ్మరి శ్రీను తదితరులు ఉన్నారు.

## మల్లారెడ్డిగూడలో ఘనంగా పోచమ్మ బోనాలు



బోనాల వేడుకల్లో పోతురాజులు, భక్తులు

**షాబాద్, ఆగస్టు 19, ప్రభాతవార్త :** పోచమ్మ బోనాలు సందర్భంగా షాబాద్ మండల పరిధిలోని మల్లారెడ్డిగూడ గ్రామంలో ఘనంగా నిర్వహించారు. పోచమ్మ ఆలయం వద్ద స్వామివారి కళ్యాణం కన్నులపండువగా నిర్వహించారు. అనంతరం బోనాల ఊరేగింపు ప్రారంభమైంది. శివసత్తుల పునాకాలతో, పోతురాజుల విన్యాసాలతో, యువకులు కేరింతలతో ఘనంగా బోనాలు ఊరేగింపు జరిగింది. గ్రామస్థులంతా పోచమ్మ తల్లి ఊరువాడ చల్లగా చూడు స్వామి, వర్షాలు కురిపించి ప్రజలను సుఖసంతోషాలతో ఉండేవిధంగా చూడు తల్లి అంటూ అంటూ అమ్మవారిని వేడుకున్నారు. ఈకార్యక్రమంలో సర్పంచ్,నాయకులు, భక్తులు తదితరులు ఉన్నారు.



భారత్ బంద్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న మాలమహానాడు నేతలు

## భారత్ బంద్‌ను విజయవంతం చేద్దాం

**మాల మహానాడు రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మహేష్ మాల**

**షాద్‌నగర్‌రూరల్, ఆగస్టు 19, (ప్రభాతవార్త) :** ఎస్సీ ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణ పైన సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ విరుద్ధమని అందుకు నిరసనగా ప్రజా సంఘాల పిలుపు మేరకు ఈనెల 21న భారత్ బంద్ నిర్వహిస్తున్నామని, బంద్‌ను విజయవంతం చేయాలని మాల మహానాడు రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మహేష్‌మాల పిలుపునిచ్చారు. సోమవారం షాద్‌నగర్ పట్టణంలోని స్థానిక అర్ అండ్ బి గెస్ట్‌హౌస్ సమీపంలో మాల మహానాడు ఆధ్వర్యంలో బంద్‌కు సంబంధించిన వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఎస్సీ ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణ పై వచ్చిన తీర్పు రాజకీయ ప్రయోజనాలు పొందేందుకు, రిజర్వేషన్లను క్రమంగా తొలగించేందుకు పన్నిన కుట్ర అని, రాజ్యాంగాన్ని బలహీన పరిచి రిజర్వేషన్లు తొలగించి ఎస్సీ, ఎస్టీలను ఆర్థికంగా సామాజికంగా అణిచివేసే కుట్రలు జరుగుతున్నాయని వారు ఆరోపించారు. అంబేద్కర్ వాదులందరూ ఐక్యతతో తిప్పి కొడదామని, బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగం ద్వార మనకు కల్పించిన హక్కులను కాపాడుకుందామన్నారు. సుప్రీంకోర్టు తీర్పును దేశ వ్యాప్తంగా ఉన్న దళిత గిరిజన సంఘాలు రాజకీయ పార్టీలు తీవ్రంగా ఖండిస్తున్నాయన్నారు. అందులో భాగంగానే ఈనెల 21న భీమ్‌సేన, ట్రైబర్ ఆర్మీ ప్రజా సంఘాలు భారత్ బంద్‌కు పిలుపునిచ్చాయని, ఈ బంద్‌కు మద్దతు ఇస్తూ తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్‌లో ఉన్న మాల సమాజం తరలిరావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ నియోజకవర్గం అధ్యక్షుడు వినోద్, శేఖర్, కేశవులు, మూర్తి, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

## ప్రాణాలు పోతున్నా.. వాగులపై వంతెనలు నిర్మించరా?



ఈవగుదాటేదెలా, నిన్నకురి వర్షానికి పొంగిపొరలుతున్న వాగు

**మర్పల్లి ఆగస్టు 19 ప్రభాతవార్త :** మర్పల్లి మండలంలోని పలు ప్రమాదకరమైన వాగుల్లో ప్రాణాలు పోతున్న వాగులపై వంతెనలు నిర్మించడంలో ఆధికారులు నిర్లక్ష్యవైఖరి అవలంబిస్తున్నారని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు మండలంలోని సిరిపూరం,వీర్లపల్లి,రావులపల్లి, కుదుగుంట, గురంగట్టు,వాగులపై ఎత్తైన వంతెనలు లేకపోవడంతో భారివర్షాలు కురిచినప్పుడు వాగులు ప్రమాదకరంగా మారుతు ప్రాణాలు బలికోంటున్నాయి.గత రెండు సంవత్సరాల క్రితం 30 జులై 2021 రోజు మధ్యాహ్నం భారీ వర్షం కురవడంతో మొమిన్ పెట్ మండలంలో పెండ్లి విందులు ముగించుకొని మర్పల్లి మండలంలోని వరుని గ్రామమైన రావులపిల్లి తిరిగి వస్తున్న పెండ్లి కారు రాగులపల్లి వాగులో కొట్టుకుపోగా పెండ్లి కూతురుతో పాటు మరో ఇద్దరు మృత్యువాత పడ్డారు.అధికారులు,ప్రజా ప్రతినిదులు,పోలీసులు, మూడు రోజులపాటు శ్రమించి మృతువులను వెలికి తీశారు.ముందు ముందు ఇలాంటి సంగటనలు జరుగ కుండా వంతెనలు నిర్మిస్తామని పలువురు నాయకులు అన్న సంవత్సరాలు గడుస్తున్న పలితం లేకుండ పోతుంది. చేతులు కాలినప్పుడు ఆకులు పట్టుకోవడం అన్నచందనంగా,ప్రమాదాలు జరిగిన్నప్పుడై వాగ్దానాలు చేయడం వాటిని గాలికి వదిలేయడం సర్వసాధానమైపోయిందని పలువురు అంటున్నారు.మండలంలోని గురంగట్టు తాండాలో గతంలో ఆటో కోటుకుపోగా వరద ప్రహాంలో కొట్టుకుపోయి మహిళ మృతి చెందింది.తాండాకు పోవలంటే మరోదారి తేవపోవడంతో ప్రణాలను అరచేతిలో పెట్టుకొని వాగు దాటుతున్నారు.సిరిపూరం వాగులో గతంలోపలువుపు కొట్టుకుపోయి తృట్టిలో ప్రాణాలతో బయటపడ్డ సంఘటనలు అనేకం ఉన్నాయి.వాగులు వచ్చినప్పుడు వగుల వద్ద పోలీసులను కాపల ఉంచేకన్నా మండలంలోని పలు ప్రమాదకరమైన వాగులపై వంతెనలు నిర్మించి శాశ్వతంగా ప్రాణినివారణ చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

## దోషులను కఠినంగా శిక్షించాలి

**- తెలంగాణ బెంగాలీ సంఘాలు డిమాండ్**

**చార్మినార్, ఆగస్టు 19 ప్రభాతవార్త :** కోలకతా ఆర్‌జికర్ మెడికల్ కళాశాల పీజీ వైద్యురాలి హత్యాచారం ఘటనకు సంబంధించిన దోషులను కఠినంగా శిక్షించాలని తెలంగాణ బెంగాలీ సమితి అధ్యక్షులు దీపాంకర్ పాల్ డిమాండ్ చేశారు.



కొలకతా ఆర్‌జికర్ మెడికల్ కళాశాల పీజీ వైద్యురాలి హత్యాచారం ఘటనను నిరసిస్తూ సోమవారం తెలంగాణ బెంగాలీ సమితితో పాటు పద్నాలుగు బెంగాలీ సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో పాతబస్తీలో నిరసన వ్యక్తం చేయటంతో పాటు కొవ్వొత్తుల ప్రదర్శన జరిగింది.ఈ సందర్భంగా దీపాంకర్ పాల్ మాట్లాడుతూ ఈ ఘటనకు సంబంధించి ఎంతటి వారినైనా కఠినంగా శిక్షించాలని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు మళ్లీ జరగకుండ తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.చేలాపుర,గుల్జారాహౌస్, మదీనా,హైకోర్టు, గాయత్రీ భవన్ ప్రాంతాలలో కొవ్వొత్తుల నిరసన ప్రదర్శన కొనసాగింది.ఈ కార్యక్రమంలో తెలంగాణ బెంగాలీ సమితి ప్రతినిధులు దీపాంకర్ పాల్, మంజీరా నస్కర్,పలు బెంగాలీ యూనియన్‌ల ప్రతినిధులు శంభురాయ్, మానస, ఉత్తమ్ మండల్,హిమాన్స్, బాబూలాల్,నబో, ఉత్తమ్‌తో పాటు పెద్ద ఎత్తున ఘాన్సీ బజార్ డివిజన్‌కు చెందిన బెంగాలీ మహిళలు పాల్గొన్నారు.



## రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపిన సిఎల్ శ్రీనివాస్ యాదవ్

**తలకొండపల్లి, ఆగస్టు 19, ప్రభాతవార్త** బిఆర్ఎస్ పార్టీ సీనియన్ నాయకుడు సిఎల్ శ్రీనివాస్‌యాదవ్‌కు రక్షాబంధన్ సందర్భంగా వారి సోదరి మాధవి రాఖీ కట్టడం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్‌యాదవ్ సోదర సోదరీమణులకు రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఎమ్మెల్యే కశిరెడ్డికి రాఖీ కట్టిన సోదరి



**తలకొండపల్లి, ఆగస్టు 19, ప్రభాతవార్త** రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డికి ఆయన నివాసంలో సోదరి శ్రీమతి రామేశ్వరమ్మ రాఖీ కట్టి మిఠాయి తినిపించి ఆశీర్వదించారు. ఎమ్మెల్యే సతీమణి మాధవి కుమారుడు కృష్ణ వంశీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

## సెంటర్‌ఆఫ్ ఎక్సెలెన్స్ ఫర్ యూత్ ఎంపవర్‌మెంట్ ఆన్ ఎడబ్ల్యుఎస్ క్లౌడ్ ఆర్కిటెక్ ప్రారంభం



సదస్సు ను జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న డైరక్టర్ సీవీ.క్రిష్టారెడ్డి, ఐసీటీ అకాడమీ హెడ్ గోపాల్

**ఘట్‌కేసర్, ఆగస్టు 19, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మండలం చౌదరిగూడలోని నల్ల నర్సింహ్మారెడ్డి కళాశాలలో బిటెక్ సీఎస్‌ఈ, ఎఎంఎల్, డాటా సైన్స్ అండ్ ఐటీ 4వ సంవత్సరం విద్యార్థుల ఆధ్వర్యంలో సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్ ఫర్ యూత్ ఎంపవర్‌మెంట్ ఆన్ ఎడబ్ల్యుఎస్ క్లౌడ్ ఆర్కిటెక్‌ను ఘనంగా ప్రారంభినట్లు కళాశాల డైరక్టర్ డాక్టర్ సీవీ. క్రిష్టారెడ్డి తెలిపారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ ఐసీటీ అకాడమీ స్టేట్ హెడ్ బి.గోపాల్ పాల్గొన్నారు. కళాశాల డైరక్టర్ సీవీ క్రిష్టారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి ఉన్నత స్థాయి కి ఎదగాలని కోరారు. విద్యార్థులకు సర్వీసెస్ కంప్యూటింగ్/లంబ ఫంక్షన్స్ అండ్ అమెజాన్ వెబ్ సర్వీసెస్‌పై శిక్షణ ఇస్తామని ప్రోగ్రాం కన్వీనర్ డాక్టర్ రామేశ్వరయ్య తెలిపారు. ఈకార్యక్రమంలో కళాశాల డీన్ డాక్టర్ జి.జనార్ధనరాజు, టీపీఓ కె.శ్రీకాంత్, ఐసీటీ సమన్వయకర్త డాక్టర్ శ్రీహరిరాజు, ఐసీటీ మెంటర్ సిహెచ్.రమ్య, ఎన్.సమత తదితరులు పాల్గొన్నారు.

## భాగ్యనగర్ ఉత్సవ సమితి మేడ్చల్ అసెంబ్లీ కన్వీనర్‌గా రామతీర్థ





శశిధర్ చేతుల మీదుగా నియామకపత్రం అందుకుంటున్న రామతీర్థ

**ఘట్‌కేసర్, ఆగస్టు 19, ప్రభాతవార్త:** భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్‌గా గుండ్ల రామతీర్థ నియమితులయ్యారు. ఈమేరకు భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ఆర్గనైజింగ్ కార్యదర్శి డాక్టర్ రావినూతల శశిధర్ చేతుల మీదుగా ఆయన నియామకపత్ర ం అందుకున్నారు. వినాయక ఉత్సవాలలో ఘట్‌కేసర్ పట్టణానికి చెందిన రామతీర్థ అందిస్తున్న భక్తి, ఆధ్యాత్మిక, సాంస్కృతిక సేవలను గుర్తించి మేడ్చల్ నియోజకవర్గ కన్వీనర్‌గా నియమించగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈకార్యక్రమంలో సికింద్రాబాద్ పార్లమెంట్ ఇంచార్జ్ ఆలె భాస్కర్, మల్కాజ్‌గిరి పార్లమెంట్ సమన్వయకర్త నాయిని బుచ్చిరెడ్డి, సెంట్రల్ కమిటీ సభ్యులు ఇంద్రాల రమేశ్, గణేశ్ ఉత్సవ సమితి నాయకులు పాల్గొన్నారు.

## నీలిమ ఆసుపత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరం



వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న ఛైర్‌వర్సన్ పావని

**ఘట్‌కేసర్, ఆగస్టు 19, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మున్సిపల్ కొండాపూర్‌లో నీలిమ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పల్లె దవాఖానా ఆవరణలో నిర్వహించిన శిబిరాన్ని మున్సిపల్ ఛైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్ సందర్శించి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వెంకటాపూర్‌లోని నీలిమ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది రోగులకు బీపీ, షుగర్, సాధారణ వైద్య పరీక్షలు జరిపి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. నీలిమ ఆసుపత్రి ద్వారా పేదలకు 50 శాతం రాయితీపై ఆరోగ్య కార్డులను అందజేశారు. ఉచిత వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. ఈకార్యక్రమంలో నీలిమ ఆసుపత్రి సీఓఓ ఎస్.నీలిమ, కౌన్సిలర్ చందుపట్ల వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి చిల్కూరి గోపాల్‌రెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యులు ఎస్‌కె.శౌకత్‌మియా, డాక్టర్లు శి, చిన్న ఒబుపప్ప, నర్సులు చంద్ర, దీప్తి, మధురిమ, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

## సోదర భావానికి ప్రతీక రక్షాబంధన్

**సంగారెడ్డి బ్యూరో, ఆగస్టు 19 ప్రభాతవార్త:**

సోదర భావానికి ప్రతీకగా ప్రతి ఏటా జరుపుకునే పండుగ రక్షాబంధన్ అని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మెదక్ బాలసదనం బాలికలు సుమారు 16 మంది జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్‌కు రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ సోదర భావానికి ప్రతీకగా ప్రతియేటా జరుపుకునే పండుగ రక్షా బంధన్ అని అన్నారు. రాఖీ పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లా ప్రజలకు కలెక్టర్ రాహుల్ రాజ్ శుభాకాంక్షలు తెలిపరు.